సాక్షి ములుగు

ఆదివారం । 12 । అక్టోబర్ । 2025



గుదిబండగా ఈవీ బస్సులు

టీజీఎస్ ఆర్టీసీలోని ఎలక్ట్రిక్ బస్సులు తరచూ మరమ్మతుకు గురవుతుండటంతో ప్రయాణికులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. - 8లో▸



కిలాడీ దంపతులు

చిల్పూరు మండలకేంద్రానికి చెందిన దంపతులు అధిక వడ్డీ ఇస్తామంటూ ఆశ చూపి రూ.కోట్లలో వసూలు చేసి ఐపీ పెట్టి పరారయ్యారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $30^0/22^0$

జిల్లాలో ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

హేమాచలుడిని దర్శించుకున్న బీజేపీ నేత



మంగపేట: మండల పరిధిలోని శ్రీహేమాచల లక్ష్మీనర్సింహస్వామిని బీజేపీ ఎండోమెంట్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన ప్రసాద్ తివారీ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి సారిగా ఆలయానికి వచ్చిన ఆయన కుటుంబ సభ్యుల గోత్ర నామాలతో ఆలయ పూజారులు స్వయంభు స్వామివారికి ప్రత్యేక అర్చన జరిపించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం ఇచ్చారు. ప్రధానమంత్రి మోదీ ఆధ్వర్యంలో దేశం సుభిక్షంగా ప్రపంచంలోనే అగ్రగామిగా ఉండాలని, బీహార్, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట పార్టీ జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాసరావు ఉన్నారు.

సబ్‌స్టేషన్‌కు 33 కేవీ లైన్ ప్రారంభం



ములుగు రూరల్: మల్లంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు 33 కేవీ నూతన లైన్‌ను టీజీ ఎన్పీడీసీఎల్ సీఈ ఆపరేషన్ రాజు చౌహాన్ ప్రారంభించారు. ఈ మేరకు శనివారం విద్యుత్ సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యుత్ లైన్‌తో రామచంద్రాపూర్, కొడిశలకుంట గ్రామాల వినియోగదారుల లోటేజ్ సమస్యలు తీరుతాయని తెలిపారు. 33 కేవీ లైన్ పునరుద్ధరణ చేసిన సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి, ములుగు ఎస్ఈ మల్హార్‌నాయక్, డీఈ నాగేశ్వర్‌రావు, ఏడీఈ వేణుగోపాల్, ఏఈ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

కాలసర్ప, శని పూజలకు భక్తుల రద్దీ



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ దేవాలయంలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కాలసర్ప నివారణ, నవగ్రహాల వద్ద శనిపూజలకు శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ముందుగా భక్తులు త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు చేసి కాలసర్ప, శని పూజలను నిర్వహించారు. అనంతరం స్వామివారి గర్భగుడిలో అభిషేక పూజలు నిర్వహించారు. దీంతో ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి కనిపించింది.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

భూపాలపల్లి అర్బన్: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్యారోగ్యశాఖ, దిశ ములుగు ఆధ్వర్యంలో శనివారం భూపాలపల్లి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ నుంచి అంబేడ్కర్ సెంటర్ మీదుగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ ఉమాదేవి హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన సమావేశానికి ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమాదేవి, ఆస్పత్రి ఆర్ఎంఓలు డాక్టర్ దివ్య, డాక్టర్ రాజేష్, దిశ క్లస్టర్ మేనేజర్ జ్యోతి, మారి సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ సదానందం హాజరై వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. 2030 సంవత్సరం నాటికి హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రించడంలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యారోగ్యశాఖ సిబ్బంది, మారి సంస్థ కార్యకర్తలు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ ప్లాంట్ పరిశీలన

భూపాలపల్లి అర్బన్: ఏరియాలోని సింగరేణి సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను సోలార్ జీఎం సీతారామ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా త్వరలో ఏరియాలో నూతనంగా ఏర్పాటు చేయనున్న మరో 10 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్‌కు స్థలం, పరికరాలు, ప్రాజెక్టుకు కావాల్సిన సలహాలు, సూచనలు అధికారులకు వివరించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న సోలార్ విద్యుత్ ఉత్పత్తి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎర్రన్న, మారుతి, అప్పారావు, గోపీనాథ్, రాహుల్ పాల్గొన్నారు.

సండే స్పెషల్


వినూత్న కట్టడం.. విస్తృత ప్రచారం!

నీటిలో తేలియాడే ఇటుకలు.. నల్లరాతి స్తంభాలు.. సరిగమలు పలికే శిల్పం.. భూకంపాలను తట్టుకునే ఆలయం.. ఓరుగల్లుకు చరిత్ర అందించిన అతిగొప్ప వరం రామప్ప. యునెస్కో గుర్తింపుతో ఈఆలయ గొప్పదనం విశ్వవ్యాప్తమైంది. ఇప్పుడు ఆ కట్టడం ప్రపంచ దేశాలకు ఆదర్శమవుతోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు, చరిత్రకారులు వారి వారి దేశాల్లో రామప్పను పోలిన కట్టడాలు నిర్మించడంలో భాగస్వాములవుతున్నారు. అంతేకాకుండా ఓరుగల్లులోని వివిధ ప్రాంతాల్లో నిర్మించిన అద్భుత కట్టడాలను పరిచయం చేస్తూ వాటి గొప్పదనాన్ని ప్రపంచ నలుమూలలకు తెలిసేలా వరల్డ్ హెరిటేజ్ క్యాంపు వివిధ దేశాల వలంటీర్లకు శిక్షణ ఇస్తోంది. ఈ క్యాంపు ప్రత్యేకతలే ఈ ఆదివారం 'సాక్షి' స్పెషల్ స్టోరీ.

- వెంకటాపురం(ఎం)



వలంటీర్లకు రామప్ప ఆలయ శిల్పాల ప్రత్యేకతలను వివరిస్తున్న టూరిస్ట్ గైడ్



రామప్ప ఆలయం ఎదుట వలంటీర్లు



రామప్ప ఖ్యాతి ప్రపంచానికి తెలిసేలా వరల్డ్ హెరిటేజ్ క్యాంపు

- కాకతీయుల చారిత్రక కట్టడాలపై వలంటీర్లకు అవగాహన
- క్యాంపులో 12 రాష్ట్రాల నుంచి 35 మంది విద్యార్థులు, ముగ్గురు ఇరాన్ దేశస్తులు
- ఇక్కడ నేర్చుకున్నది తమ ప్రాంతాల్లో ఆచరణ..

వరల్డ్ హెరిటేజ్ కమిటీ ఏటా అక్టోబర్‌లో వివిధ దేశాల వలంటీర్లకు శిక్షణ ఇస్తోంది. గత నాలుగేళ్లుగా రామప్పలో క్యాంపు కొనసాగుతుండగా.. ప్రస్తుతం ఈనెల 8న క్యాంపు ప్రారంభమైంది. 12 రాష్ట్రాలకు చెందిన 35 మందితో పాటు ఇరాన్ దేశానికి చెందిన మరో ముగ్గురు శిక్షణ శిబిరంలో పాల్గొంటున్నారు. ఈనెల 17తో హెరిటేజ్ క్యాంపు ముగియనుంది.

ప్రత్యేకతను వివరిస్తూ.. ప్రత్యక్షంగా చూపెడుతూ

1213లో కాకతీయులు నిర్మించిన రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు ఎలా వచ్చిందో వివరిస్తూ.. ప్రత్యక్షంగా ఆలయ ప్రత్యేకతలను వలంటీర్లకు చూపెట్టడమే హెరిటేజ్ క్యాంపు ముఖ్య ఉద్దేశం. రామప్ప ఆలయంతో పాటు సిమెంట్, ఐరన్ లేకుండా నాటి కాలంలో నిర్మించిన ఆలయాలు, వాటి విశిష్టతను వలంటీర్లకు వివరిస్తున్నారు. వేయిస్తంభాల గుడి, ఖిలా వరంగల్, కోటగుళ్ల ఆలయాలతోపాటు ఆదిమానవులు నివసించి ఉన్నట్లు పెయింటింగ్స్ ఉన్న పాండవుల గుట్ట చరిత్ర, మేడారం సమ్మక్క, సారలమ్మ చరిత్ర, చుట్టుపక్కల ఉన్న ప్రదేశాలు, వాటి చరిత్రను వలంటీర్లకు వివరిస్తున్నారు.

భాగస్వాములవుతున్న వలంటీర్లు

వరల్డ్ హెరిటేజ్ క్యాంపునకు హిస్టరీ, సివిల్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్, ఆర్కియాలజీ, టూరిజంలో ఉన్నత విద్యనభ్యసిస్తున్న వారిని ఎంపిక చేసి కాకతీయుల కాలంలో ఉపయోగించిన నిర్మాణ పద్ధతులు, ఇంజనీరింగ్ ప్రతిభ, నీటిపారుదల విధానాలు, కళలు, సంపద వంటి వాటిని వలంటీర్లకు వివరిస్తున్నారు. శిబిరంలో శిక్షణ పొందిన వలంటీర్లు తమ దేశంలో రామప్ప ఆలయ నిర్మాణ పద్ధతులు, శిల్ప కళాసంపదను వివరిస్తూ రామప్ప కట్టడాల వలే తమ ప్రాంతంలో ఏదైనా నిర్మించేందుకు కృషి చేయడంలో భాగస్వాములు అవుతున్నారు. దీంతో రామప్ప ఖ్యాతి ప్రపంచవ్యాప్తంగా విస్తరించే అవకాశం ఉంది.

ఇక్కడ తెలుసుకుని.. అక్కడ ఆచరించి



వలంటీర్ల శిక్షణలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రమణమూర్తి

రామప్పలో గతంలో వలంటీర్లుగా శిక్షణ పొందిన కొంతమంది రామప్ప ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఆయా దేశాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. త్రిపురకు చెందిన వలంటీర్ విద్యార్థి రామప్ప ఆలయ పైకప్పునకు ఉపయోగించిన డంగు సున్నం వాడకంపై పీహెచ్‌డీ చేస్తున్నారు. గుజరాత్, ఔరంగాబాద్ నుంచి వచ్చిన వలంటీర్లు ఇద్దరు ఇంటర్నేషనల్ సంస్థలో పనిచేస్తూ రామప్ప, ములుగు పర్యాటక ప్రాంతాలకు ప్రత్యేక టూర్ ప్యాకేజీ ఏర్పాటు చేసి పర్యాటకులను తీసుకొస్తున్నారు. వలంటీర్‌గా శిక్షణ పొందిన సరిత అగర్వాల్ యూఎస్‌లో వారసత్వ కట్టడాల పునరుద్ధరణలో భాగస్వామ్యమయ్యారు. ముంబయికి చెందిన వలంటీరు నీటిలో తేలియాడే ఇటుకలపై పరిశోధన చేసి డంగు సున్నం వాడకంపై పీహెచ్‌డీ చేస్తున్నట్లు హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు శ్రీధర్‌రావు తెలిపారు.

రామప్ప ఖ్యాతిని విస్తరిస్తా..



శిక్షణ శిబిరంలో నేర్చుకున్న మెళకువలతో రామప్ప ఖ్యాతిని విస్తరించేందుకు కృషి చేస్తా. మ్యూజియంలో పని చేయడానికి, మ్యూజియానికి వచ్చిన ప్రజలకు చారిత్రక కట్టడాల గురించి వివరించేందుకు ప్రయత్నం చేస్తా. ఆలయంలోని ఆర్కిటెక్చర్ చాలా డిఫెరెంట్‌గా బాగుంది.

- హమీద్ దాస్, కోల్‌కతా

ఇండియా కల్చర్ నచ్చి వచ్చాను..



ఇండియా కల్చర్ అంటే చాలా ఇష్టం. గతంలో కెన్యా, ఇరాన్ హెరిటేజ్ క్యాంపులో పాల్గొన్నా. రామప్పలో హెరిటేజ్ క్యాంపు వాటి కంటే బాగుంది. పర్సనల్‌గా ఇండియా కల్చర్‌పై ప్రాజెక్ట్ తీసుకుని ఇక్కడి పాఠాలను అనుభవంగా తీసుకుంటా. రామప్ప టెంపుల్ వండర్ ఫుల్.

- నియూషా, ఇరాన్

సౌత్ హిస్టరీపై ఆసక్తితో..



కాకతీయుల చరిత్ర, సౌత్ ఇండియా హిస్టరీపై ఆసక్తితో క్యాంపునకు వచ్చా. భూకంపాలను తట్టుకునేలా రామప్ప ఆలయాన్ని ఎలా నిర్మించారో తెలుసుకోవాలనే తపనతో వచ్చా. క్యాంపు ద్వారా సరికొత్త విషయాలు తెలుసుకున్నా. హెరిటేజ్ బిల్డింగ్ ప్రొటెక్ట్ చేయడం కోసం కృషి చేస్తా.

- సమీక్ష షిండే, పుణె, మహారాష్ట్ర

హెరిటేజ్ ట్రస్టు ప్రధాన పాత్ర



రామప్ప ఆలయానికి ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు రావడంలో హెరిటేజ్ ట్రస్టు ప్రధాన పాత్ర పోషించింది. ప్రతీ ఏటా 40మంది విద్యార్థులను వలంటీర్లుగా తీసుకొని రామప్ప ఆలయం ప్రత్యేకత ను వివరిస్తూ ప్రాక్టికల్‌గా చూపెడుతున్నాం. మన ఖ్యాతి అందరికీ తెలుస్తోంది.

- ప్రొఫెసర్ పాండురంగారావు

భావితరాల కోసం క్యాంపులు



రామప్ప శిల్పా కళాసంపదను భావితరాలకు అందించేందుకే రామప్పలో వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ల క్యాంపు నిర్వహిస్తున్నాం. దేశంలోని వివిధ ప్రాంతాల వారిని వలంటీర్లుగా ఎంపిక చేసి చారిత్రక కట్టడాలపై అవగాహన కల్పిస్తున్నాం.

- జనగాం శ్రీధర్‌రావు, హెరిటేజ్ క్యాంపు కో-ఆర్డినేటర్

రామప్ప టెంపుల్ బ్యూటిఫుల్



రామప్పలో జర్మనీ దేశస్తులు

వెంకటాపురం(ఎం): రామప్ప టెంపుల్ బ్యూటిఫుల్‌గా ఉందని జర్మనీకి చెందిన డానియల్, వోలివా, సారియా కొనియాడారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రామప్ప దేవాలయాన్ని వారు శనివారం సందర్శించి రామప్ప రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. ఆలయ విశిష్టత గురించి గైడ్ విజయ్‌కుమార్ వివరించగా రామప్ప శిల్పకళ బాగుందని కొనియాడారు. అదేవిధంగా ఇంగ్లండ్‌కు చెందిన జొనాతన్ డేవిస్ సందర్శించగా రామప్ప ఆలయ విశిష్టత గురించి గైడ్ వెంకటేశ్ ఆయనకు వివరించారు.



మాజీ డీజీపీ జేవీ రాముడును సన్మానిస్తున్న పూజారి హరీశ్ శర్మ

రామప్పలో మాజీ డీజీపీ రాముడు..

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సుప్రసిద్ధ రామప్ప దేవాలయాన్ని ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ జేవీ రాముడు శనివారం సందర్శించారు. రామలింగేశ్వరస్వామికి ఆయన పూజలు నిర్వహించగా పూజారి హరీశ్ శర్మ తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. అనంతరం శాలువాతో సత్కరించారు. రామప్ప ఆలయ విశిష్టత గురించి గైడ్ విజయ్‌కుమార్ వివరించగా శిల్పకళ సంపద బాగుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక ఎస్సై చల్లా రాజు ఉన్నారు.

ఏజెన్సీలో దోమ తెరల పంపిణీ

ములుగు రూరల్: ఏజెన్సీ గ్రామాల్లో శనివారం ఎన్టీపీసీ దక్షిణ విభాగం వారి సహకారంతో దోమతెరల పంపిణీని చేపట్టారు. ఈ మేరకు శనివారం మండల పరిధిలోని సర్వాపూర్, అంకన్నగూడెం, పెగడపల్లి పంచాయతీల్లో వెయ్యి కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎన్టీపీసీ చీఫ్ జనరల్ పాణిగ్రాహి, లయన్స్‌క్లబ్ ఫౌండేషన్ ఏరియా లీడర్ దీపక్‌భట్టాచార్జీ, లయన్స్ 320ఎఫ్ జిల్లా గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్యలు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్టీపీసీ చీఫ్ జనరల్ పాణిగ్రాహి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలకు చేయూతనందిస్తున్నామన్నారు. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో గతంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. సామాజిక సేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ ఏజీఎం అఖిల్ పట్నాయక్, లయన్స్ 320 ఎఫ్ వైస్ గవర్నర్లు సుధాకర్‌రెడ్డి, హరికిషన్, వివేకనందపురం క్లబ్ ప్రెసిడెంట్ నరేష్‌చంద్రదాస్, డీఎంహెచ్‌ఓ అప్పయ్య, ములుగు క్లబ్ అధ్యక్షుడు దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రమణారెడ్డి, ప్రకాశం, పద్మజాదేవి, తదితరులు పాల్గొన్నారు.



దోమతెరలను పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

సమాచార హక్కు చట్టం వజ్రాయుధం

- సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి

భూపాలపల్లి అర్బన్: సమాచార హక్కు చట్టం ప్రజలకు వజ్రాయుధమని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాల్లో భాగంగా శనివారం ఏరియా జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జీఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాచార హక్కు చట్టం అనేది ప్రజాస్వామ్య భారతదేశంలో పారదర్శకత, జవాబుదారీతనానికి ఒక బలమైన సాధనమన్నారు. భూపాలపల్లి ఏరియాలో ఈ చట్టాన్ని అమలు చేయడంతో ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఇంకా మెరుగైన సేవలు అందించడానికి అధికారులు కృషిచేయాలని సూచించారు. అనంతరం అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు కవీంద్ర, రవికుమార్, రాజేశ్వర్, ఎర్ర న్న, మారుతి, ప్రదీప్, కార్తీక్, రాజు పాల్గొన్నారు.



అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న జీఎం

మాస్టర్ ప్లాన్‌తోనే అభివృద్ధి సాధ్యం

- రానున్న రోజుల్లో ఏటూరునాగారం మున్సిపాలిటీ ఏర్పాటు
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

ఏటూరునాగారం/ఎస్ఎస్‌తాడ్వాయి: మాస్టర్ ప్లాన్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని, రానున్న రోజుల్లో ఏటూరునాగారం మున్సిపాలిటీ ఏర్పాటు చేయడంతో పాటు అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని కూరగాయలు, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణానికి రూ.1 కోటితో నిర్మించనున్న పనులకు కలెక్టర్ దివాకర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణితో కలిసి శనివారం మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే ప్రణాళికలు తప్పనిసరిగా తయారుచేసుకోవాలన్నారు. ఏటూరునాగారం గతంలో చిన్న పల్లెటూరుగా ఉండి.. ప్రస్తుతం రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడి 5 మండలాలకు కేంద్రంగా, రెండు రాష్ట్రాలకు సరిహద్దుగా ఏర్పడిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని మండల కేంద్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. గతంలో ఏటూరునాగారం, ములుగు రెండు ప్రాంతాల మధ్య బస్సు డిపో విషయంలో సమస్య తలెత్తిందని ఈ విషయంపై సంబంధిత అధికారులు, రవాణా శాఖ మంత్రితో చర్చించి ఏటూరునాగారం ప్రాంతంలో రూ. ఏడున్నర కోట్లతో బస్‌డిపో ఏర్పాటుకు శంకుస్థాపన చేసినట్లు వెల్లడించారు. ఏటూరునాగారం నుంచి గోదావరి నది వరకు రెండున్నర కోట్ల రూపాయలతో సీసీ రోడ్డు మంజూరు చేసినట్లు వివరించారు. అందరి సహకారంతో ఏటూరునాగారం ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తామని, రానున్న రోజులలో మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తామని వివరించారు. అనంతరం కలెక్టర్ దివాకర మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పూర్తిస్థాయిలో గ్రౌండ్, స్విమ్మింగ్‌పూల్ వంటి అభివృద్ధి పనులను చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ అజయ్ కుమార్, నాయకులు ఇర్సవడ్ల వెంకన్న, చిటమట రఘు, వావిలాల ఎల్లయ్య, లాలయ్య, సులేమాన్, గౌస్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా తాడ్వాయి మండల పరిధిలోని కొండపర్తి క్రాస్ వద్ద చెన్నాపురం తోగులో రూ. 3 లక్షలు, జలగలంచ గొత్తికోయ గూడెంలో రూ. 3 లక్షలతో నిర్మించిన పాఠశాలలను మంత్రి సీతక్క శనివారం ప్రారంభించారు. అనంతరం మంతిర మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న గిరిజనులకు విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జలగలంచ, చెన్నాపురం తోగు గొత్తికోయగూడెం రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉండటం ద్వారా కొన్ని సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. అయినప్పటికీ గొత్తికోయ పిల్లలకు చదువు అందించాలనే ఉద్దేశంతో ప్రాథమిక పాఠశాలలను నిర్మించి ప్రారంభించినట్లు తెలిపారు. 53 గొత్తికోయ హబిటేషన్ గూడేలలో సర్వే నిర్వహించి సోలార్ విద్యుత్‌కు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. అనంతరం మంత్రి చిన్నారులకు పలకలు, స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీఓ చిత్రమిశ్రా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, డీపీఓ దేవరాజు తదితరులు పాల్గొన్నారు.



ఏటూరునాగారంలో మార్కెట్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క



గొత్తికోయ పిల్లలకు పలకలు పంపిణీ చేసిన సీతక్క

మోడల్ బస్టాండ్ పనుల్లో వేగం పెంచాలి

ములుగు రూరల్: జిల్లాకేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న మోడల్ బస్టాండ్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు శనివారం మోడల్ బస్టాండ్ నిర్మాణ పనులను మంత్రి సీతక్క పరిశీలించి మాట్లాడారు. బస్టాండ్ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. బస్టాండ్ ఆవరణలో ఉన్న పోచమ్మ తల్లి ఆలయానికి ఆటంకం కలుగకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు పొదాల ఓం ప్రకాశ్, నల్లెల్ల భరత్‌కుమార్ అహ్మద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



మోడల్ బస్టాండ్ పనులను పరిశీలిస్తున్న మంత్రి

అలరించిన పేరిణి నృత్యం..

రామప్పలో రంజిత్ కుమార్ బృందం ప్రదర్శన

వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రక రామప్ప దేవాలయంలో శనివారం రంజిత్ కుమార్ బృందం పేరిణి నృత్యం అలరించింది. వరల్డ్ హెరిటేజ్ క్యాంపెయిన్‌లో భాగంగా వలంటీర్లకు పేరిణి నృత్యంపై రంజిత్‌కుమార్ బృందం అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా వలంటీర్లతో పాటు రామప్ప సందర్శనకు వచ్చిన విదేశీయులు సైతం పేరిణి నృత్యాన్ని చూసి మంత్రముగ్ధులయ్యారు. మరుపురానిదని కొనియాడారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పాండురంగారావు, క్యాంపు కోఆర్డినేటర్ శ్రీధర్‌రావు, డాక్టర్ కుసుమ సూర్యకిరణ్, గైడ్‌లు విజయ్‌కుమార్, వెంకటేష్, పేరిణి కళాకారులు గురుదేవ్ మరకల, లోహిత్ తొడంగ, సంతోష్, రేగుల చందూ, పల్నాటి శ్రీజ, బందారు వైష్ణవి, తేజస్విని, చరిష్మా పాల్గొన్నారు.

నాలుగో రోజుకు చేరిన హెరిటేజ్ క్యాంపు

రామప్పలో కొనసాగుతున్న వరల్డ్ హెరిటేజ్ క్యాంపు శనివారం 4వ రోజుకు చేరుకుంది. ఉదయం 6గంటలకు యోగా గురువు రాంబాబు వలంటీర్లకు యోగాసనాలు నేర్పించారు. రంగారెడ్డి జిల్లా ఇంటాక్ కన్వీనర్, ప్రొఫెసర్ గాయత్రి, ప్రొఫెసర్ పాండురంగారావు కాకతీయ మాన్యుమెంట్స్‌పై వలంటీర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రొఫెసర్ రమణమూర్తి సివిల్ ఇంజనీరింగ్ అంశంపై, టూరిజం అంశంపై అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్ వలంటీర్లకు వివరించారు. అనంతరం ప్రొఫెసర్లకు మెమొంటోలు అందజేశారు.



రామప్ప ఆలయంలో పేరిణి నృత్యం



లాస్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

మృత్యువుతో పోరాడి ఓడిన చిన్నారి

- 60 రోజులుగా చికిత్స పొందుతున్న నిహాన్సిక మృతి


నిహాన్సిక (ఫైల్)

చిల్పూరు: ఓ చిన్నారి 60 రోజులుగా మృత్యువుతో పోరాడి ఓడింది. రెండు నెలల క్రితం వేడి నీళ్ల బకెట్‌లో పడగా శరీరం మొత్తం కాలింది. దీంతో తల్లిదండ్రులు హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శనివారం కన్నుమూసింది. దీంతో ఆ కుటుంబంతోపాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పల్లగుట్ట జీపీ పరిధిలోని సయ్యద్‌హుస్సేన్ పల్లికి చెందిన దాసరి కుమార్‌యాదవ్, చైతన్య దంపతులు. వీరికి కూతురు నిహాన్సిక(3) ఉంది. ఈ క్రమంలో రెండు నెలల క్రితం రోజు మాదిరిగానే తల్లి చైతన్య కూతురికి స్నానం చేయించేందుకు వేడినీళ్లను బకెట్‌లో పోసి చల్లనీళ్ల కోసం వెళ్లింది. ఈ సమయంలో ఆడుకుంటూ వచ్చిన నిహాన్సిక ఒక్కసారిగా వేడినీళ్ల బకెట్‌లో పడింది. నీరంతా పడడంతో శరీరం మొత్తం కాలింది. వెంటనే తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

వరి పొలానికి నీళ్లు పారించేందుకు వెళ్లి..

- బావిలో పడి మహిళారైతు మృతి


విజయ(ఫైల్)

మహబూబాబాద్ రూరల్: వరి పొలానికి నీరు పారించేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి ఓ మహిళా రైతు మృతి చెందింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి మహబూబాబాద్ మండలం తోకబోడు తండా పరిధిలో చోటుచేసుకుంది. కురవి ఎస్సై జి.సతీశ్ కథనం ప్రకారం.. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి సాంక్రియా తండాకు చెందిన నూనావత్ విజయ (39)కు మండలంలోని తోకబోడు తండా శివారులో ఎకరం వ్యవసాయ భూమి ఉంది. అందులో వరి పంట సాగు చేస్తుండగా, పొలానికి నీరు పారించడానికి శుక్రవారం మధ్యాహ్నం వెళ్లి రాత్రి పొద్దుపోయే వరకూ ఇంటికి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, తండా వాసులు ఆమె ఆచూకీ కోసం గాలించి వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి పరిశీలించారు. అక్కడ ఆమె చెప్పులు, టవల్ కనిపించాయి. దీంతో బావిలో వెతకగా విజయ మృతదేహం కనిపించింది. ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు అగ్నిమాపక సిబ్బంది సాయంతో బావి నుంచి విజయ మృతదేహాన్ని బయటకుతీశారు. మృతురాలి కుమారుడు శ్రీరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా కురవి హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగించారు.

ఎమ్మెల్యే 'దొంతి'కి పరామర్శ


కాంతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క పరామర్శించారు. ఇటీవల మాధవరెడ్డి తల్లి కాంతమ్మ మృతి చెందారు. శనివారం హనుమకొండలోని దొంతి నివాసంలో కాంతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాధవరెడ్డిని పరామర్శించిన వారిలో విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు నాగరాజు, సత్యనారాయణరావు, ఎంపీ బలరామ్‌నాయక్, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ జంగా రాఘవరెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎంపీ రాజయ్య, 'కుడా' చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, పీసీసీ బాధ్యుడు ప్రభాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

గుదిబండగా ఈవీ బస్సులు..


మరమ్మతుకు గురై నిలిచిన జేబీఎం ఎలక్ట్రిక్ బస్సులు

- తరచూ మరమ్మతులకు గురవుతున్న పరిస్థితి
- బస్సులు అందుబాటులో లేక విసిగిపోతున్న కండక్టర్లు
- రోజంతా నిరీక్షించి ఇంటికెళ్తున్న ఉద్యోగులు

హన్మకొండ: ఎలక్ట్రిక్ బస్సులు(ఈవీ).. టీజీఎస్ ఆర్టీసీకి గుదిబండగా మారాయి. తరచూ వైఫల్యాలతో ప్రయాణికులతోపాటు ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఎప్పుడు? ఎక్కడ? ఆగుతుందో తెలియని పరిస్థితుల్లో జేబీఎం ఎలక్ట్రిక్ బస్సుల తీరు ఉందని ఉద్యోగులు మొత్తుకుంటున్నారు. ప్రతీ రోజు 10 నుంచి 20 బస్సులు మరమ్మతులకు గురవుతున్నాయని ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి. మరమ్మతులు చేసేందుకు అవసరమైన విడిభాగాలు అందుబాటులో లేక రోజుల తరబడి నిరుపయోగంగా ఉంటున్నాయి. ఫలితంగా బస్సులు అందుబాటులో లేక విధులకు వచ్చే కండక్టర్లకు నిరీక్షణ తప్పడం లేదు. రోజంత డిపోలోనే నిరీక్షించి డ్యూటీ లేకుండానే తిరిగి వెళ్తున్నారు. మరుసటి రోజు వస్తే ఆ రోజు కూడా డ్యూటీ ఉంటుందో లేదో తెలియని దుస్థితి టీజీఎస్ ఆర్టీసీ వరంగల్–2 డిపోలో నెలకొందని ఉద్యోగులు మొత్తుకుంటున్నారు. వెయిటింగ్‌తో విసిగి వేసారి పోతున్నామని కండక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని వారు వాపోయారు.

కంట్రోలర్‌ను కాదని కండక్టర్‌కు అదనపు బాధ్యతలు..

ట్రాఫిక్ విధులు నిర్వహించే ఓ అధికారి తీరుతో మానసికంగా కృంగిపోతున్నామని పలువురు ఉద్యోగులు పేర్కొంటున్నారు. అవస రాలకు సెలవు ఇవ్వాలని కోరితే ససేమిరా అంటోందని వారు వాపోతున్నారు. కాగా, యాజమాన్యం సంస్థ అవసరాల కోసం సీనియర్ ఉద్యోగులకు అసిస్టెంట్ డిపో క్లర్క్ (ఏడీసీ)లుగా పదోన్నతి కల్పించింది. ప్రతీ డిపోలో అవసరం మేరకు ఏడీసీ (కంట్రోలర్)లను నియమించింది. వారు అందుబాటులో ఉన్నా.. కంట్రోలర్‌ను కాదని కండక్టర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కండక్టర్ బుకింగ్ బాధ్యతలు అప్పగించడంపై ఉద్యోగ వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. యాజమాన్యం అదనపు బాధ్యత (ఓడీ)లను రద్దు చేసినా వరంగల్–2 డిపోలో అదనపు బాధ్యతతో కండక్టర్‌ను తీసుకోవడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రతీ రోజు 10 బస్సులకు తగ్గకుండా మరమ్మతులు..

కార్బన్ ఉద్గారాలను భారీగా తగ్గించి స్వచ్ఛమైన రవాణ వ్యవస్థను నిర్మించడానికి ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సులను ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా వరంగల్ రీజియన్‌కు మొత్తం 112 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించగా, జేబీఎం ఎకోలైఫ్ సంస్థ 112 బస్సులు సరఫరా చేసి నిర్వహణ బాధ్యతలు చూసుకుంటుంది. టీజీఎస్ ఆర్టీసీతో కలిసి బస్సులు నడుపుతోంది. మొత్తం 112 బస్సుల్లో ఇందులో సూపర్ లగ్జరీ 21, డీలక్స్ 22, ఎక్స్‌ప్రెస్ బస్సులు 69 ఉన్నాయి. వీటిని హనుమకొండ నుంచి హైదరాబాద్, నిజామాబాద్, ఏటూరు నాగారం, సూర్యాపేట, సిద్దిపేట, కాళేశ్వరం, ఖమ్మం రూట్లలో నడుపుతున్నారు. అయితే ఈ బస్సులు తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతీ రోజు 10 బస్సులకు తగ్గకుండా ఫెయిలవుతున్నాయి. ప్రతీ రోజు 15 వేల కిలో మీటర్లు రద్దవుతుందని అధికారులు తెలిపారు.

జేబీఎం బస్సులపై ఆర్టీసీ ఉదాసీనత..

ఆర్టీసీ అద్దె బస్సులు మరమ్మతుకు గురై ఒక్క రోజు నడపకుంటే రూ.2 వేలు జరిమానా విధిస్తున్న ఆర్టీసీ.. జేబీఎం బస్సులు పదుల సంఖ్యలో నిలిచిపోతున్నా ఎలాంటి జరిమానా విధించకుండా ఉదాసీనత ప్రదర్శిస్తోంది. ఉద్యోగాలు రాక ఉపాధి కోసం ఆర్టీసీలో అద్దె ప్రాతిపదికన బస్సులు నడుపుతున్న వారికి మాత్రం జరిమానా విధిస్తూ కార్పొరేట్ కంపెనీలకు వత్తాసు పలుకుతూ అన్ని విధాలా సహకరిస్తోందనే విమర్శలు, ఆరోపణలు వినిపిస్తున్నాయి. అద్దె చెల్లింపులోనూ ఆ బస్సుల యజమానులకు ఆర్టీసీ వివక్ష చూపుతోంది. జేబీఎం బస్సులకు కిలో మీటర్‌కు రూ.39.90 చొప్పున చెల్లిస్తుండగా, ప్రైవేట్ అద్దె బస్సులకు రోజు తిరిగే కిలో మీటర్లను బట్టి రూ.6 నుంచి రూ.15 వరకు చెల్లిస్తోంది. అద్దె ఎక్కువ మొత్తంలో చెల్లిస్తున్న ఎలక్ట్రిక్ బస్సులు నడవకున్నా చూసీచూసినట్లు వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాణ్యత లేని బస్సులతో డ్రైవర్లు నష్టపోతున్నారని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. బస్సు బాడీ డ్యామేజీ అయితే డ్రైవర్ల నుంచి రూ.వేలల్లో వసూలు చేస్తున్నారని కార్మిక సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

నేడు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి రాక


హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌లో బస్ పాయింట్ల వద్ద రూట్లవారీ స్టిక్కర్లు అంటిస్తున్న అధికారులు

టీజీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి ఆదివారం వరంగల్ పర్యటనకు వస్తున్నారు. ఆర్టీసీ ఎండీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నాగిరెడ్డి తొలి పర్యటన వరంగల్ రీజియన్‌లో కొనసాగనుంది. వరంగల్ రీజియన్ పరిస్థితులపై ఈ పర్యటనలో అధ్యయనం చేసి అధికారులకు అవసరమైన సూచనలు ఇవ్వనున్నారు. ఎండీ పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బస్‌పాయింట్ల వద్ద ఏ రూట్ బస్సులు నిలుపుతారో వివరాలతో కూడిన స్టిక్కర్లు అంటించారు.

కిలాడీ దంపతులు..

- అధిక వడ్డీ ఇస్తామంటూ రూ. కోట్లలో వసూళ్లు ..
- ఐపీ పెట్టి పరార్
- లబోదిబోమంటున్న బాధితులు

చిల్పూరు: కిలాడీ దంపతులు భారీ మోసానికి పాల్పడ్డారు. తమ సంస్థలో పెట్టుబడి పెడితే నెలకు రూ. వెయ్యికి రూ. 50 వడ్డీ ఇస్తామంటూ చెప్పగా నమ్మకంతో గ్రామంలోని 42 మంది దాదాపు రూ. కోటి వరకు ఇచ్చారు. అయితే వడ్డీ దేవుడెరుగు కనీసం ఇచ్చిన డబ్బు కూడా చెల్లించకుండా ఆ దంపతులు ఐపీ పెట్టి పరారయ్యారు. దీంతో బాధితులు లబోదిబోమంటూ శనివారం పోలీసులను ఆశ్రయించారు. తమకు వడ్డీ లేకున్నా అసలు(డబ్బు) ఇప్పించాలంటూ వేడుకున్నారు. 42 మందిలో కొంత మంది బాధితులైన ఈరగోని క్రాంతి, నారగోని క్రాంతికుమార్, సోమ రవి, కుందేళ్ల శ్రీకాంత్, నగేశ్ కథనం ప్రకారం.. జనగామ జిల్లా చిల్పూరు మండల కేంద్రానికి చెందిన పిట్టల రాజేశ్, రచన దంపతులు 2023లో ఓ ఫైనాన్స్ కంపెనీని ఏర్పాటు చేశారు. తమ కంపెనీలో పెట్టుబడి పెడితే అధిక వడ్డీ ఇస్తామని తెలిపారు. అయితే ఈ ఆఫర్‌ను కొద్ది రోజులు ఎవరూ నమ్మలేదు. మొదట ఒకరిద్దరు రూ. లక్ష ఇవ్వగానే వడ్డీ రూపంలో నెలకు సంబంధించి రూ. 5 వేలు ఇచ్చారు. ఇలా ఆరు నెలలపాటు ఇచ్చారు. దీంతో చాలా మందికి నమ్మకం కలిగింది. ఇలా 42 మంది దాదాపు రూ. కోటి ఇచ్చారు. అయితే సంవత్సరం న్నర నుంచి వడ్డీ ఇవ్వడం లేదు. దీంతో బాధితులు తమ డబ్బులు ఇవ్వాలంటూ ఆ దంపతుల చుట్టూ తిరిగారు. వారు రేపుమాపు అంటూ కాలం వెల్లదీయడంతో విసిగిపోయారు. చివరకు రెండు నెలల క్రితం ఆ దంపతులను గ్రామంలోని నిలదీయగా ఐపీ పెట్టి పరారయ్యారు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ విషయంలో పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

రైతుల ఆర్థిక ప్రగతికి మరింత కృషి

- పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం ప్రారంభం
- తెలంగాణలో జనగామతోపాటు మరో మూడు జిల్లాలకు అవకాశం
- వర్చువల్‌గా పథకాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ
- పాల్గొన్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి, అధికారులు

జనగామ రూరల్: వ్యవసాయ రంగాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన' పథకం జిల్లా రైతుల్లో ఆశలు నింపుతోంది. దేశవ్యాప్తంగా వంద జిల్లాలను ఈ పథకం కింద ఎంపిక చేయగా, తెలంగాణ నుంచి నాలుగు జిల్లాలు జనగామ, నారాయణ పేట, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్ జిల్లాలను గుర్తించారు. ఈ మేరకు శనివారం ప్రధాన మంత్రి మోదీ ఈ పథకాన్ని వర్చువల్‌గా ప్రారంభించగా, జనగామ కలెక్టరేట్‌లో కలెక్టర్ రిజ్వాన్ బాషా, ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ఉత్పాదకతలో మార్పులు తీసుకొచ్చేలా కేంద్రం నూతన పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం అమలు కానుందన్నారు.

జనగామకు ప్రత్యేక ప్రాధాన్యం

వర్ష ఆధారిత పంటల ఉత్పత్తి ప్రాంతంగా ప్రసిద్ధిగాంచిన జనగామ జిల్లాలో ఈ పథకం మొక్కజొన్న, పత్తి, ధాన్యం, మిర్చి వంటి పంటలకు కొత్త దారులు తెరుస్తుందని వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు. జిల్లాలోని రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా పంటల ప్రాసెసింగ్ యూనిట్లు, ప్యాకేజింగ్ కేంద్రాలు, మార్కెట్ లింకులు ఏర్పాటు చేయనున్నారు. దీంతో రైతులకు మధ్యవర్తుల అవసరం తగ్గి ఉత్పత్తికి తగిన ధర లభించే అవకాశం ఉందని అధికారులు తెలుపుతున్నారు.


పథకం వర్చువల్ ప్రారంభంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా, ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి, అధికారులు

త్వరలో టీహబ్‌తో కేహబ్ ఒప్పందం

- రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రులు శ్రీధర్‌బాబు, వెంకట్‌రెడ్డి, వీసీ ప్రతాప్‌రెడ్డి, కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, తదితరులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కేహబ్ హైదరాబాద్‌లోని టీహబ్‌తో త్వరలో అవగాహన ఒప్పందం చేయబోతున్నామని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. కాకతీయ యూనివర్సిటీ ఫార్మా అలుమ్ని గోల్డెన్‌జూబ్లీ ఉత్సవాలు శనివారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని వెల్లడించారు. వరంగల్ వంటి ద్వితీయ శ్రేణి నగరాలను ఆవిష్కరణలు, ఇంక్యుబేషన్ స్టార్టప్‌లకు హాబ్‌లుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ రూసా వంటి సంస్థల మద్దతుతో విశ్వవిద్యాలయం ఫార్మసీ కాలేజీ మరింత అభివృద్ధి సాధిస్తోందన్నారు. వందలాది మంది పరిశోధకులు పీహెచ్‌డీలు పూర్తిచేసి వివిధ స్థాయిల్లో ఉన్నారన్నారు. అనంతరం మంత్రులు, వీసీ, పూర్వ విద్యార్థులు సావనీర్, రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ జె. కృష్ణవేణి కేయూ ప్రస్తుత, పూర్వ ఆచార్యులు పాల్గొన్నారు. ఈనెల 12న కూడా ఉత్సవాలు కొనసాగనున్నాయి.

అంతర్జాతీయ స్థాయిలో 'ఎస్సార్'కు ర్యాంకింగ్

- కల సాకారమైంది
- ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ వరదారెడ్డి



మాట్లాడుతున్న వరదారెడ్డి

హసన్‌పర్తి: ప్రపంచ ప్రఖ్యాత టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ (టీహెచ్‌ఈ) వరల్డ్ ర్యాంకింగ్‌లో ఎస్సార్‌కు చోటు దక్కింది. ఇటీవల విడుదల చేసిన ర్యాంకింగ్–2026లో 801–1000 శ్రేణిలో నిలిచింది. ఈ మేరకు శనివారం అన్నాసాగరంలోని ఎస్సార్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి మాట్లాడారు. తెలంగాణలో అంతర్జాతీయ ర్యాంకింగ్ సాధించిన ఏకైక యూనివర్సిటీ ఎస్సార్ అని చెప్పారు. బోధన, పరిశోధన, సైటేషన్స్, అంతర్జాతీయ దృష్టి కోణం, ఇండస్ట్రీ ఇన్‌కమ్ వంటి ఐదు ప్రధాన విభాగాల ఆధారంగా 17 సూచిక ద్వారా ఈ ర్యాంకింగ్‌ను ప్రకటించినట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 5లక్షల యూనివర్సిటీలుండగా, ఐదు ఏళ్ల వయసు కలిగిన ఎస్సార్ గుర్తింపు పొందడం సంతోషకరంగా ఉందన్నారు.

కల సాకారమైంది..

తాను నెలకొల్పిన విద్యాసంస్థ ప్రపంచంలోనే గుర్తింపు సాధించాలనే తన కల సాకారమైందని ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్, ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎ. వరదారెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఇటీవల వెలువడిన ఎన్ఐఆర్ఎఫ్–2025 ర్యాంకింగ్‌లో ఎస్సార్ యూనివర్సిటీ విభాగంలో 91 స్థానం సాధించినట్లు చెప్పారు. విశ్వవిద్యాలయ విభాగంలో 101–150 శ్రేణిలో నిలిచినట్లు చెప్పారు. 2026 ఎడిషన్ జెడ్డా (సౌదీ అరేబియా)లో జరిగిన వరల్డ్ అకడమిక్ సందర్భంగా విడుదల చేసిన ర్యాంకింగ్‌లో అమెరికా మొదటి స్థానంలో చోటు దక్కించుకోగా, భారత దేశం రెండో స్థానంలో నిలిచిందన్నారు. ఇందులో ఓవరాల్ విశ్వవిద్యాలయ విభాగంలో ఎస్సార్ 28 స్థానంలో, ప్రైవేట్ యూనివర్సిటీల్లో 10వ స్థానంలో చోటు దక్కించుకుందన్నారు. వైస్ చాన్స్‌లర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ బలమైన విద్యా ప్రతిపాదిక, అంతర్జాతీయ దృష్టి కోణానికి ర్యాంకింగ్ నిదర్శనంగా పేర్కొన్నారు. సమావేశంలో ప్రో వైస్ చాన్స్‌లర్ డాక్టర్ మహేశ్, ప్రొఫెసర్ రమణారావు, రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, డీన్ ప్రొఫెసర్ పి.వి.రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి ఇద్దరు చిన్నారుల మృతి

- బహిర్భూమికి వెళ్లగా ప్రమాదం
- మృతులు అన్నాచెల్లెలి కుమారులు
- దసరా పండుగకు తాతమ్మ ఇంటికి..
- మూడు గ్రామాల్లో విషాదం


రితిక్(ఫైల్)


జతిన్(ఫైల్)


మృతదేహాల వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

కొత్తగూడ: పిల్లలిద్దరు అన్నాచెల్లెలి కుమారులు. దసరా పండుగకు తాతమ్మ ఇంటికి వచ్చారు. ఇంట్లో వాళ్లు ఓ చావు కార్యక్రమానికి వేరే ఊరికి వెళ్లారు. మధ్యాహ్న సమయంలో చిన్నారులిద్దరు బహిర్భూమి కోసం సమీపంలోని బావి వద్దకు వెళ్లారు. అందులో దిగిన చిన్నారులకు లోతు తెలియక ప్రమాదవశాత్తు ఒకరితర్వాత మరొకరు మునిగి చనిపోయారు. ఈ విషాదకర ఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడెంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో నివాసం ఉంటున్న ఇటుకాల నర్సయ్య–స్వాతి దంపతుల కుమారుడు రితిక్(10), ములుగు జిల్లా పులిమడుగు గ్రామానికి చెందిన అనిత– శ్రీనివాస్ దంపతుల కుమారుడు జతిన్(09)లు దసరా సెలవులకు ఎంచగూడెంలోని తాతఅమ్మ ఇటుకాల సారయ్య –నర్సమ్మ వాళ్ల ఇంటికి వచ్చారు. వరంగల్ జిల్లా అశోక్‌నగర్‌లో బంధువు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు ఆ బాలురిద్దరిని ఇంటి వద్ద వదిలివెళ్లారు. మధ్యాహ్నం సమయంలో రితిక్, జతిన్‌లు కలిసి బహిర్భూమికి సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందారు. చావుకు వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంటి వద్ద చిన్నారులు కనిపించకపోవడంతో వెతకడం ప్రారంభించగా బావిగడ్డపై సమీపంలో పిల్లల చెప్పులు కనిపించాయి. అనుమానంతో వెతకడంతో ముందుగా రితిక్ మృతదేహం లభించింది. విషయం తెలుసుకున్న కొత్తగూడ ఎస్సై రాజ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని జతిన్ మృతదేహాన్ని బయటకు తీయించారు.

అన్నా చెల్లెలి కుమారులు...

అనిత, నర్సయ్యలు అన్నాచెల్లెళ్లు. అనిత కుమారుడు జతిన్, నర్సయ్య కుమారుడు రితిక్‌లు వరుసకు బావాబామ్మర్దులు. ఇటీవల కురిసిన వర్షాలకు బావిగడ్డ నానడం.. అందులోకి దిగిన జతిన్, రితిక్‌లు బావిగడ్డ జారడంతో ఈత రాకపోవడంతో మునిగి చనిపోయినట్లు భావిస్తున్నారు. పిల్లల మృతదేహాలను చూసి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. పండుగ కోసం వచ్చి పరలోకాలకు వెళ్లారని, బావాబామ్మర్దులు ఒకరిని కాపాడేందుకు మరొకరు చనిపోయారంటూ గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇద్దరు పిల్లల మృతితో ములుగు జిల్లా పులిమడుగు, వరంగల్ జిల్లా నర్సంపేట, మహబూబాబాద్ జిల్లా ఎంచగూడెం గ్రామాల్లో విషాదం నెలకొంది.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు షురూ


మానసను సన్మానిస్తున్న 'కుడా' చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్ : హనుమకొండలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ బాక్సింగ్ హాల్‌లో శనివారం పాఠశాల క్రీడల సమాఖ్య అండర్–17 రాష్ట్ర స్థాయి బాలబాలికల బాక్సింగ్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఈ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. జాతీయ స్థాయిలో పతకం సాధించిన క్రీడాకారులకు తన వంతుగా రూ.50వేలు నగదు పురస్కారం అందజేస్తానన్నారు. రెండు రోజుల పాటు జరుగనున్న పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 130 మంది బాలురు, 150 మంది బాలికలు హాజరైనట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వెలిశెట్టి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 28 నుంచి నవంబర్ 3వ తేదీ వరకు అరుణాచల్‌ప్రదేశ్‌లో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం బాక్సింగ్‌లో ఎన్ఐఎస్ పూర్తి చేసిన ఖమ్మంకు చెందిన క్రీడాకారిణి మానసను సన్మానించారు. కార్యక్రమంలో మామునూరు పీటీసీ సీఐ కాశీరాం, ఒలింపిక్స్ సంఘం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మంచాల స్వామిచరణ్, తెలంగాణ పీఈటీల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శీలం పార్థసారథి, కె. మల్లారెడ్డి, ఎస్‌జీఎఫ్ అండర్–19 జిల్లా కార్యదర్శి నరెడ్ల శ్రీధర్, భూపాలపల్లి డీవైఎస్ఓ రఘు, ఇండియా బాక్సింగ్ కోచ్ ఆనంద్‌భాస్కర్ పాల్గొన్నారు.

భార్యాభర్తల ఆత్మహత్యాయత్నం

- కుటుంబ కలహాలే కారణం?

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం బొమ్మాపూర్ గ్రామానికి చెందిన భార్యాభర్తలు శనివారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ కలహాలే కారణమని సమాచారం. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ములకల రాజేశ్వరి, కిరణ్‌లకు నాలుగు నెలల కిందట ప్రేమవివాహం జరిగింది. కాగా, ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో శనివారం భార్యాభర్తలిద్దరూ పురుగులమందు తాగగా స్థానికులు గమనించి మహదేవపూర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాజేశ్వరిని భూపాలపల్లికి , కిరణ్‌ను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి వైద్యం అందజేస్తున్నారు. ఈ విషయమై ఎస్సై పవన్‌కుమార్‌ను సంప్రదించగా భార్యాభర్తలు పురుగుల మందు తాగిన విషయం తన దృష్టికి వచ్చిందని, కానీ, ఎలాంటి ఫిర్యాదూ రాలేదని తెలిపారు.

ఖోఖో అభివృద్ధికి విశేష కృషి

- కేకేఎఫ్ ఇండియా ఎథిక్స్ కమిషన్ కన్వీనర్ రాఘవరెడ్డి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కేకేఎఫ్ ఇండియా ఎథిక్స్ కమిషన్ కన్వీనర్ రాఘవరెడ్డి

వరంగల్ స్పోర్ట్స్: ఖోఖో క్రీడాభివృద్ధికి 15 ఏళ్లుగా విశేష కృషి చేస్తున్నామని, అత్యున్నత స్థాయిలో కల్పిస్తున్న వసతులను క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని తెలంగాణను దేశంలో మొదటి స్థానంలో నిలపాలని ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎథిక్స్ కమిషన్ కన్వీనర్, తెలంగాణ రాష్ట్ర, ఉమ్మడి వరంగల్ జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి అన్నారు. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు కర్ణాటకలో జరుగనున్న సీనియర్ మెన్ అండ్ ఉమెన్ సౌత్‌జోన్ ఖోఖో పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్ల ఎంపిక పోటీలను శనివారం హనుమకొండలోని జేఎన్ఎస్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చే ఏడాది జనవరిలో కాజీపేటలో జాతీయస్థాయి సీనియర్ ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖోఖో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా శిక్షణ శిబిరానికి ఎంపికైన వరంగల్ కరీమాబాద్‌కు చెందిన ఖోఖో క్రీడాకారిణి నవ్యశ్రీ ని రాఘవరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ ఖోఖో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనాతి కృష్ణమూర్తి, హ్యాండ్‌బాల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. పవన్ కుమార్, పీఈటీల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.